సాక్షి
నల్లగొండ
శుక్రవారం ၊ 19 ၊ మే ၊ 2023



కన్నెకల్లు సందర్శనకు..

కన్నెకల్లుకు, తమ పూర్వీకులకు సంబంధం ఉందని తెలుసుకున్న బ్రహ్మానందం ఆ గ్రామానికి రానున్నారు.

- 10లో



బౌద్ధులకు నందనవనం

బుద్ధవనం బౌద్ధులకు నందనవనమని మయన్మార్ దేశ మత వ్యవహారాల శాఖ డీడీజీ నోమిన్‌టున్ అన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం 42° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఐటీఐ మొదటి విడత అడ్మిషన్లు ప్రారంభం

రామగిరి(నల్లగొండ): ఐటీఐ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరంలో మొదటి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్, నల్లగొండ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నాలుగు ప్రభుత్వ, పది ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు www.iti.telangana.gov.in వెబ్‌సైట్ నందు జూన్ 10వ తేదీ లోపు దరఖాస్తుల చేసుకోవాలని కోరారు.

మత్స్యకారులకు డిజిటల్ గుర్తింపు కార్డులు

నల్లగొండ టూటౌన్: జిల్లాలోని మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘాలు, మహిళా మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘాలు, లైసెన్స్ కలిగిన సహకార సంఘాల సభ్యులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సంఘాల మత్స్య కార్మికులు జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ప్రొఫార్మా పొంది దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నలుగురికి కారుణ్య నియామక ఉత్తర్వులు



ఉత్తర్వుల కాపీ అందిస్తున్న జెడ్పీ చైర్మన్

నల్లగొండ: జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల కింద నలుగురు అభ్యర్థులకు గురువారం నల్లగొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి ఉత్తర్వుల కాపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంబాబు ఉన్నారు.

ప్రజా ఉద్యమాల్లో ముందుంటాం

నల్లగొండ టౌన్ : మహిళలను చైతన్యవంతం చేస్తూ ప్రజా ఉద్యమాలను నడిపించడంలో ముందుంటామని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బత్తుల హైమావతి అన్నారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరుగుతున్న ఐద్వా జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా సామాన్య ప్రజలు సరైన పౌష్టికాహారం తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, జిట్ట సరోజ, ప్రభావతి, అరుణకుమారి, నాగమణి, ధనలక్ష్మి, ఊర్మిలల తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 200మంది హాజరు



జాబ్ మేళాలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 200మందిగా పైగా నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. ఎంఎస్ఎన్ ల్యాబ్, పేటీఎం, ఎస్‌బీఐ, లైఫ్, వెస్టేజ్ సంస్థలు, విజేత కళాశాలలు సంయుక్తంగా ఈ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకే జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పారా మెడికల్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కళాశాల అధ్యాపక బృందం, ఉపాధి కల్పన అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ఆలయ మండపంలో నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

● ప్రశాంతంగా ఎడ్‌సెట్



నల్లగొండలోని ఎస్పీఆర్ స్కూల్లో గురువారం ఎడ్‌సెట్‌కు హాజరైన అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎంజీయూ అధికారులు

నకిలీపై టాస్క్‌ఫోర్స్

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సిద్ధమైన యంత్రాంగం

- మండల స్థాయి నుంచి జిల్లా వరకు ప్రత్యేక బృందాలు
- జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పకడ్బందీగా నిఘా
- నకిలీవి విక్రయిస్తే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరికలు



కనగల్ ఎక్స్ రోడ్డులోని విత్తనాల షాపులో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నాగేష్, ఏఓ అమరేందర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఏటా వానాకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలు బెడద తప్పడం లేదు. నకిలీ పత్తి, మిర్చి, కూరగాయల విత్తనాలను వేసి రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈసారి ముందుగానే వాటి నిరోధానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుచరితతో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాబోతున్న తరుణంలో నకిలీ, నాసికరం విత్తనాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలు, కమిటీలు పక్కా చర్యలు చేపట్టేలా నిర్ణయించారు.

ఐదేళ్లలో భారీగా నకిలీ విత్తనాలు పట్టివేత

జిల్లాలో గడిచిన ఐదేళ్లలో పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. ఇతర జిల్లాల నుంచి నకిలీ విత్తనాలను తీసుకొచ్చి జిల్లాలో విక్రయిస్తున్న వ్యక్తులపై ప్రివెంటీవ్ డిటెన్షన్ (పీడీ) యాక్టు కింద కేసులు నమోదు చేశారు. 2017 సంవత్సరంలో 987 కిలోలు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. 2020 సంవత్సరంలో 5,778 కిలోలు, 2021లో 1,245 కిలోలు, 2022లో 210 కిలోల నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. చాలాచోట్ల లూజ్ విత్తనాలను తీసుకొచ్చి హైబ్రీడ్ కాటన్ విత్తనాలు అనే పేరుతో విక్రయిస్తూ పట్టుపడ్డారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు పట్టుకుంటున్నా.. కొందరు వారికి చిక్కకుండా రైతులకు అంటగడుతూనే ఉన్నారు.

రంగంలోకి టాస్క్ బృందాలు

ఆంధ్రప్రదేశ్‌తోపాటు వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలను తీసుకొచ్చి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. దీంతో ఈసారి ముందస్తుగానే టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. టాస్క్‌ఫోర్స్ బృందాలు గురువారం నుంచే రంగంలోకి దిగేలా ఆదేశాలు జారీచేశారు. జిల్లా స్థాయిలో అదనపు ఎస్పీ, జిల్లా వ్యవసాయ అధికారి నేతృత్వంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం పనిచేయనుంది. డివిజన్ స్థాయిలో డీఎస్పీ, ఏడీఏల నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ కమిటీలు, సర్కిల్ స్థాయిలో సీఐలతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిఘా పెడతాయి. మండల స్థాయిలో స్థానిక వ్యవసాయ అధికారి, ఎస్‌ఐ నేతృత్వంలోని కమిటీ పర్యవేక్షణ ఉంటుంది. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఉన్నట్టు సమాచారం వచ్చిందంటే ఈ బృందాల నేతృత్వంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపడతారు. ముఖ్యంగా వాడపల్లి, నాగార్జునసాగర్ చెక్ పోస్టు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తారు. మన జిల్లాకు పొరుగున ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా బూత్పూర్ ప్రాంతం నుంచి నకిలీ విత్తనాలను వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలోని వాటి పరిసర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు.

నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు : ఎస్పీ అపూర్వరావు



నల్లగొండ క్రైం: రైతులు నకిలీ విత్తనాలను కొని మోసపోవద్దని, నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని ఎస్పీ అపూర్వరావు సూచించారు. నకిలీ విత్తనాల సరఫరా జరిగి, రైతులు నష్టపోకముందే నిఘా పెట్టి పక్కా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి సుచరితతో కలిసి ఎస్పీ అపూర్వరావు గురువారం డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, మండల వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలు 24 గంటలూ అందుబాటులో ఉంటూ నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారి పట్ల నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. డీలర్లు తాము అమ్ముతున్న విత్తన షాపుల్లో స్టాక్ బోర్డులు, లైసెన్సులు తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. స్టాక్, బిల్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, విడిగా విత్తనాలు అమ్మకూడదన్నారు. గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలనే విక్రయించాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు, ఏడీఏ కీర్తి, హుస్సేన్‌బాబు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, హాజరైన వివిధ శాఖల అధికారులు

నల్లగొండ: ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆమె తన చాంబర్‌లో జిల్లా కమిటీ సభ్యులైన అధికారులతో సీఎం కప్ పోటీల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయి పోటీలు నల్లగొండ మేకల అభినవ్ స్టేడియం, ఇండోర్ స్టేడియంలో ఉంటాయన్నారు. ఆయా స్టేడియాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. క్రీడా నిర్వహణ జిల్లా కమిటీ చైర్మన్ అనుమతితో నిధులు ఖర్చు చేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 10గంటల లోపు సాయంత్రం 4 గంటల తరువాత మాత్రమే క్రీడలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు, పరిశ్రమల శాఖ ఏడీ గణేష్, డీపీఆర్ఓ శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల వెబ్‌పోర్టల్ ఆవిష్కరణ

మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వయోవృద్ధుల పోషణ ఫిర్యాదుల వెబ్ పోర్టల్‌ను అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా గురువారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. అదేవిధంగా ఆ శాఖ రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆపదలో ఉన్న వయోవృద్ధుల కోసం రెస్క్యూ వాహనం (చేయూత వెహికిల్)ని జెండా ఊపి ప్రారంభించారు. పిల్లల నిరాదరణకు గురైన తల్లిదండ్రులు తమ పిల్లలపై ఫిర్యాదులను tsseniorcitizens.cgg.gov.inలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసే విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 14567ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ.కృష్ణవేణి, క్షేత్ర బాధ్యత అధికారి ఎం.నాగిరెడ్డి, కార్యాలయ సిబ్బంది జి.శ్రీహరి, జె.వెంకట్‌రెడ్డి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా సభ్యులు ఎస్.మల్లిఖార్జున్, సుదర్శన్ రెడ్డి,.బి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



నోములలో నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నకిరేకల్, కనగల్, గుర్రంపోడు: ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. గురువారం గుర్రంపోడు మండలం కొప్పోలు, నకిరేకల్ మండలం నోముల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. నోములలో సాయి వైష్ణవి బార్‌బాయిల్డ్ రైస్ మిల్లు, కనగల్ మండలం దర్వేశిపురంలో గల వెంకటసాయి రైస్ మిల్లును ఆయన సందర్శించి పరిశీలించారు. కనగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్, ఏపీఎంతో సమావేశమై మాట్లాడారు. సంబంధిత కాంట్రాక్టర్ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం బస్తాల నిల్వలకు తగ్గట్టుగా లారీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కనగల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీపీ కరీంపాష, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, స్థానిక ఎంపీటీసీ, లారీల ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ పాలకూరి సైదులు, ఆర్‌ఐ యాదగిరి, ఏపీఎం నరహరి పాల్గొనగా కొప్పోలులో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ హుస్సేన్, ఏఓ మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల వెంకన్న, నోములలో తహసీల్దార్ ప్రసాద్ నాయక్, ఏపీఓ ప్రభాకర్ ఉన్నారు.

21న ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

నల్లగొండ: టీఎస్‌పీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు ఫౌండేషన్ కోర్సు–1 బ్యాచ్–2023 ఎంపికకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ పడిదల నవీన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నల్లగొండ, యాదాద్రి జిల్లాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తాయనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నల్లగొండలోని డీవీకే రోడ్డులో గల శ్రీ చైతన్య హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను సంబంధిత వెబ్ సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఇతర సమాచారం కోసం సెల్ : 8465035932, 9603167257, 9010895239 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చిరు వ్యాపారులకు బాసటగా..

- నీలగిరిలో రైతు బజార్ నిర్మించిన మున్సిపల్ యంత్రాంగం
- త్వరలోనే దుకాణాల కేటాయింపు
- ఎన్జీ కాలేజీ వద్ద ఏర్పాటుకానున్న మోడల్ డబ్బాలు
- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం



ఎన్జీ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన మోడల్ డబ్బాలు

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలో చిరు వ్యాపారులకు మున్సిపాలిటీ బాసటగా నిలుస్తోంది. నిలువ నీడ లేకుండా రోడ్ల వెంట కూరగాయలు, పండ్లు విక్రయించే రైతులు, చిరు వ్యాపారులకు ఇప్పటికే పక్కగా దుకాణాలు నిర్మించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు కూరగాయలు పండించి నల్లగొండ పట్టణానికి తీసుకొచ్చి రోడ్ల వెంట, దుకాణాల ముందు పెట్టుకొని అమ్ముకుంటున్నారు. రోడ్ల వెంట కూరగాయలు అమ్ముతూ తమ వ్యాపారాన్ని దెబ్బతీయొద్దని ప్రకాశం బజారుకు చెందిన కొందరు కూరగాయల మార్కెట్ వ్యాపారులు రోడ్ల వెంట అమ్మే వారిపై దాడులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్ల వెంట కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు, రైతులకు నీలగిరి మున్సిపలు అధికారులు వెన్నుదన్నుగా నిలిచి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పక్కన నూతనంగా రైతు బజారు నిర్మాణం చేపట్టారు. ఇక్కడ దాదాపు 50 నుంచి 60 మంది రైతులకు దుకాణాలను కేటాయించే అవకాశం ఉంది. స్వయంగా కూరగాయలు తెచ్చి ప్రకాశం బజారులో అమ్ముతున్న రైతులకు దుకాణాల కేటాయింపుల ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఒక వేళ వారు ఎక్కువ మంది లేకపోతే చిరు వ్యాపారులకు రెండో ప్రాధాన్యత ఇచ్చి దుకాణాలను కేటాయించి నామమాత్రపు అద్దె వసూలు చేయనున్నారు. చిరు వ్యాపారులకు కేటాయించిన ఈ రైతు బజారును త్వరలోనే రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉంది.

పండ్ల వ్యాపారులకు మోడల్ డబ్బాలు..

నీలగిరి పట్టణంలో రహదారుల విస్తరణ, సుందరీకరణలో భాగంగా ఎన్జీ కాలేజీ ఎదురుగా ఉన్న పాకలను ఇప్పటికే తొలగించారు. ఇప్పుడు అక్కడ రహదారి విస్తరణ పనులు పూర్తయినందున అధునాతన మోడల్ డబ్బాలను మున్సిపాలిటీ ఏర్పాటు చేయించే పనిలో పడింది. గతంలో ఇక్కడ పండ్లు, కుండలు విక్రయించిన చిరు వ్యాపారులకు ఈ మోడల్ డబ్బాలను నామమాత్రపు ధర నిర్ణయించి అద్దెకు ఇవ్వనున్నారు. దాదాపు 30నుంచి 35 వరకు ఇక్కడ చిరు వ్యాపారుల కోసం ఈ మోడల్ డబ్బాలను ఏర్పాటు చేయనున్నారు. రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలకుండా పార్కింగ్ సౌకర్యంతో ఈ డబ్బాలను ఏర్పాటు చేస్తారు. ఈ మోడల్ డబ్బాలు షెటర్లు కలిగి దుకాణం మాదిరిగానే కనిపించనున్నాయి. వీటి ఏర్పాటు వలన చిరు వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

రైతులకు మొదటి ప్రాధాన్యం



రైతు బజారులో చిన్న, చిన్న పనులు తప్ప దాదాపు అన్ని పనులు పూర్తి కావచ్చాయి. అన్ని వసతులతో ఏర్పాటు చేశాం. స్వయంగా కూరగాయలు పండించి అమ్మే రైతులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తాం. మిగిలిన దుకాణాలను చిరు వ్యాపారులకు కేటాయిస్తాం.

–కేవీ.రమణాచారి, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ



ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల పక్కన నూతనంగా నిర్మించిన రైతుబజారులోని దుకాణాలు

ఏడాది తర్వాత లెక్కలంట..!

- వాటర్ షెడ్ పథకం కింద గతేడాది సబ్సిడీ పరికరాలు పంపిణీ
- ఊకొండి ప్రాజెక్టు పరిధిలో డీడీలు చెల్లించిన వారందరికీ అందించలేదు
- చింతపల్లి మండల రైతుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశించిన కలెక్టర్



ఇటీవల మునుగోడులో విచారణ జరుపుతున్న దేవరకొండ ఏపీడీ

మునుగోడు: మునుగోడు వాటర్ షెడ్ పథకం కింద అర్హులైన రైతులకు గత ఏడాది పంపిణీ చేసిన డ్రిప్, ఇతర పరికరాల వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రైతుల ఫిర్యాదుతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో పథకం కింద పంపిణీ చేసిన వివిధ పరికరాలకు సంబంధించి ఏడాది తర్వాత లెక్కలు చూడాల్సి రావడంతో అసలు విషయం బయటపడింది.

అసలేం జరిగిందంటే..

వాటర్ షెడ్ పథకంలో భాగంగా పీఎస్‌ఐ (ఉత్పత్తి, ఉత్పాదక పెంపుదల) ద్వారా ప్రభుత్వం రైతులకు సబ్సిడీలో నీటి సరఫరాకు పైపులు, మందుల పిచికారీకి తైవాన్ పంపులు, తుంపర సేద్యానికి స్ప్రింక్లర్లతో పాటు ఇతర వస్తువులను అందిస్తుంది. అయితే మునుగోడు మండలం ఊకొండి ప్రాజెక్టు పరిధిలోని మునుగోడు, చీకటిమామిడి, కచలాపురం, కొరటికల్, పలివెల గ్రామాల్లోని మొత్తం 124 మంది రైతులు పైపులు, స్ప్రింక్లర్లు, తైవాన్ పంపులు, ఇతర వస్తువులు పొందేందుకు 2022 ఏప్రిల్ మాసంలో తమ వాటధనాన్ని డీడీల రూపంలో వాటర్ షెడ్ అధికారులకు అందించారు. వారందరికీ పైపులు, ఇతర వస్తువులు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి టెండర్ పొందిన టీఎస్ ఆగ్రోస్ కంపెనీ నిర్వాహకులు తమ వాహనాల్లో వస్తువులను తీసుకొచ్చి ఇచ్చారు. ఇందులో 62 మంది రైతులకు 2,131 పైపులు, 27 మందికి తైవాన్ పంపులు, నలుగురికి స్ప్రింక్లర్లు, కల్లం పట్టాలు 22 మంది రైతులతో కలిపుకొని మొత్తం 115 మందికి అందించి మిగతా వారికి అందించలేదు. వీటికి సంబంధించి పథకం సిబ్బంది అప్పుడే లెక్కలు చూసుకోకుండా వదిలేశారు. ఇక్కడ డీడీలు చెల్లించిన మరో పది మంది రైతులకు పరికరాలు అందకపోగా పంపిణీ చేసిన వాటిలోనే కొన్ని పైపులు, మరికొన్ని తైవాన్ పంపులు తక్కువగా వచ్చాయి. దీంతో డీడీలు చెల్లించిన రైతులు వాటికోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇదే తరహాలో ఊకొండి ప్రాజెక్టు పరిధిలోని చింతపల్లి మండలంలో చాలామంది రైతులకు స్ప్రింక్లర్లు అందించాల్సి ఉన్నా అందించలేదు. దీంతో డీడీలు చెల్లించిన రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టాలని సంబంధిత జిల్లా అధికారిని ఆదేశించగా దేవరకొండ ఏపీడీని విచారణ అధికారిగా నియమించారు. దీంతో ఆయన మూడ్రోజుల క్రితం మునుగోడులో వాటర్ షెడ్, ఒప్పంద కంపెనీ సిబ్బందిని విచారణ జరిపి మొత్తం 120 పైపులు, 10 తైవాన్ పంపులు రైతులకు అందలేదని గుర్తించారు. వీటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని అంచనా. ఈ వ్యవహారంపై ఇంకా పూర్తిస్థాయిలో విచారణ కొనసాగుతోంది.

ముందే పసిగట్టి..

టెండర్ దక్కించుకున్న టీఎస్ ఆగ్రోస్ కంపెనీ నిర్వాహకుడు గత ఏడాదే ఓ ప్రత్యేక వాహనంలో పలు దఫాలుగా పైపులు తీసుకొచ్చాడు. అయితే ఆ పైపులను స్థానిక టెక్నికల్ ఆఫీసర్ దగ్గర ఉండి తీసుకోవాల్సి ఉండగా రాత్రి సమయంలో లోడు రావడంతో వాటర్ షెడ్ పథకం సదరు అధికారి కలగజేసుకొని స్థానిక సర్పంచ్ దింపుకోవాలని సూచించారు. దీంతో ఆయనతో డెలివరీ చలాన్‌లో సంతకం చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా టెక్నికల్ ఆఫీసర్ సంతకం లేకుండా కంపెనీ యజమాని ప్రభుత్వం నుంచి బిల్లు పొందేందుకు డెలివరీ చలాన్‌పై సంతకం పెట్టి అందించిచారు. కంపెనీ యజమాని మాత్రం ఆరునెలల క్రితమే బిల్లు పొందాడు. అయితే ఇతర మండలాల రైతులకు నేటికీ సబ్సిడీ పరికరాలు అందకపోవడంతో విచారణ జరుగుతుందని తెలిసిన సంబంధిత అధికారి తాను పట్టుపడకుండా సర్పంచ్‌పై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఒకవైపు విచారణ జరుగుతుండగా సంబంధిత అధికారి గతంలో రైతులకు పంపిణీ చేసిన పైపుల లెక్కల్లో తేడాలు వస్తాయని ముందగానే పసిగట్టి అన్ని సక్రమంగా సరఫరా చేసినట్టుగా నెల రోజుల క్రితం మునుగోడు సర్పంచ్‌తో ఓ లెటర్ తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారంపై అధికారులు పకడ్బందీగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో బస్సు డ్రైవర్ మృతి


డ్రైవర్ చిట్టిబాబు మృతదేహం

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా తుర్కపల్లికి చెందిన ఆంజనేయస్వామి భక్తులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో వైజాగ్, భద్రాచలం ప్రాంతాలు సందర్శించి యాదగిరిగుట్టకు వెళ్తున్నారు. మార్గమధ్యలో తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ చిట్టిబాబు(35)కు ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పి బస్సును రోడ్డు పక్కకు ఆపి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్యాపిల్లలు ఎవరూ లేరని తెలిసింది.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

దేవరకొండ: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి డివైడర్‌ను ఢీకొని మృతిచెందిన ఘటన గురువారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన పందిపోటు మధుశేఖర్(34) గ్రానైట్ బండల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 10గంటల సమయంలో బైక్‌పై దేవరకొండ నుంచి మల్లేపల్లి వైపు వెళ్తుండగా దేవరకొండ–మల్లేపల్లి ప్రధాన రహదారిలో డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి మధుశేఖర్‌ను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు రంగనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడుకు చేరిన మృతుల సంఖ్య

- తల్లీకూతుళ్లను కబళించిన మృత్యువు


మాలోతు దేవి (ఫైల్)

మిర్యాలగూడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని పొందుగుల వద్ద ఈ నెల 17న ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. దామచర్ల మండలం నర్సాపురానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు మిర్చి పంట కోసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగగా అదే రోజు ఆరుగురు మృతిచెందారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన మాలోతు దేవి(55) చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందింది. మృతురాలికి భర్త సక్రుతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉండగా, ఒక కుమార్తె ఇస్లావత్ మంజుల ప్రమాదం జరిగిన రోజే మృతిచెందింది. కుటుంబ పోషణ కోసం తల్లీకూతుళ్లు ఇద్దరూ కూలీ పనులకు వెళ్తుంటారు. దేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా సభ్యుడి అరెస్ట్

- రూ.7.92 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి: సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా సభ్యుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. గురువారం పట్టణంలోని డీసీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సయాన్ లహరి గోవాలో ఉంటూ గత మూడు సంవత్సరాల నుంచి మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తున్నాడు. ఇతడు గోవా రాష్ట్రానికే చెందిన ఎడ్మండ్ దిలీప్ నుంచి సింథటిక్ డ్రగ్స్ కొనుగోలు చేసి అక్కడే కొన్ని ప్రాంతాల్లో తక్కువ ధరలకు, మరికొన్ని ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఇటీవల గోవాలో డ్రగ్స్ వ్యాపారం సాఫీగా సాగకపోవడంతో ఖర్చులకు డబ్బులు లేక అతడు హైదరాబాద్‌లో నైట్ పబ్బుల్లో ఎక్కువగా


వివరాలు వెల్లడిస్తున్న భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర

డ్రగ్స్ వాడతారని తెలుసుకుని ఇక్కడ డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు హైదరాబాద్‌తో పాటు చౌటుప్పల్ ఏరియాలో గత ఆరు నెలల నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం చౌటుప్పల్ మండలంలోని తూప్రాన్‌పేట సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఇతరులకు డ్రగ్స్ సరఫరా చేయడానికి వచ్చిన సయాన్ లహరిని పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షలు విలువ చేసే నీలి రంగు డ్రగ్స్ మాత్రలు(60), రూ.2లక్షల విలువ చేసే పింక్ కలర్ డ్రగ్స్


స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను చూపుతున్న పోలీసులు

మాత్రలు(40), రూ.1.80 లక్షల విలువ చేసే మాండి డ్రగ్స్ మందు, రూ.లక్ష విలువ చేసే 3.9 గ్రాముల కొకైన్, ఒక బ్యాగ్, రూ.10వేల విలువ చేసే స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎడ్మండ్ దిలీప్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మొత్తం ముఠాలో ఎంత మంది ఉన్నారో దర్యాప్తులో తెలుతుందని డీసీపీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, సీఐలు మల్లికార్జున్‌రెడ్డి, మోతీరామ్, ఎస్సై లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది అనిల్, పాండు ఉన్నారు.

అమెరికా వెళ్తాడనుకుంటే అనంతలోకాలకు..

- గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- చిలుకూరు గ్రామ శివారులో ఘటన

చిలుకూరు: మరో 20 రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్లాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బుధవారం అర్ధరాత్రి చిలుకూరు గ్రామ శివారులోని శివరాత్రి నగర్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన పొందూరి సత్తిబాబు కుమారుడు పొందూరి ఉదయ్‌కిరణ్(25)తో పాటు అదే గ్రామానికి చెందిన మారోజు శివ బైక్‌పై హుజూర్‌నగర్ వెళ్లి వస్తున్నారు. మార్గమధ్యలో చిలుకూరు గ్రామ శివారులోని శివరాత్రి నగర్ దగ్గరకు రాగానే బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్ వెనుక కూర్చున్న ఉదయ్‌కిరణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న శివకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఉదయ్‌కిరణ్ మృతదేహానికి కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనట్లుగా ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మృతుడి తండ్రి సత్తిబాబు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు ఉదయ్‌కిరణ్ బీటెక్ పూర్తిచేసి అమెరికాలో ఎంఎస్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరగకపోతే మరో 20 రోజుల్లో అమెరికాకు వెళ్లేవాడని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఉదయ్‌కిరణ్ అకాల మరణంతో చిలుకూరు గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.


ఉదయ్‌కిరణ్ (ఫైల్)

క్రీడాకారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్: క్రీడాకారులు శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబర్చాలని నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాష్ట్ర కబడ్డీ క్రమశిక్షణ (డిసిప్లీనరి) సంఘం కమిటీ చైర్మన్ భూలోకరావు అన్నారు. పట్టణంలోని వీవీఎం స్కూల్లో శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ ఉచిత శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వాలీ బాల్ గోల్డ్ మెడలిస్ట్ చందా సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో క్రీడల్లో నైపుణ్యాలు నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడాకారులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఈ ప్రాంతానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. స్టేట్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తనవంతు సహకారాలు క్రీడాకారులకు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాంతిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చందా సుధాకర్‌రెడ్డి, పీడీ నాగమణి, పీఈటీలు ప్రదీప్, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న భూలోకరావు

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు.. ఆస్తి నష్టం


మునగాలలో తగలబడుతున్న గడ్డి మోపులు


రాయినిగూడెం శివారులో కాలిపోయిన బత్తాయి చెట్లను చూపిస్తున్న రైతు

రామగిరి(నల్లగొండ): ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని బత్తాయి తోట దగ్ధమైన సంఘటన తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం శివారులో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన రైతుల రెడ్డిపల్లి ఊశయ్యకు రాయినిగూడెం శివారులో 4.5 ఎకరాల బత్తాయి తోట ఉంది. గత ఐదు సంవత్సరాలుగా ఈ తోటను సాగుచేస్తున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తోటలోని 30 బత్తాయి చెట్లు, 10జామ, మామిడి, కొబ్బరి చెట్లతో పాటు డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. అయితే తన తోట పక్కన రైతులు బొస్క నర్సింహ, తాడోజు బ్రహ్మాచారి తమ పొలంలో వరి కొయ్యలను తగలబెట్టడంతోనే మంటలు వ్యాపించి బత్తాయి తోట దగ్ధమైందని అనుమానిస్తూ బాధిత రైతు తిప్పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తిప్పలమ్మగూడెంలో వ్యవసాయ సామగ్రి..

అగ్నిప్రమాదంలో వ్యవసాయ సామగ్రి దగ్ధమైన ఘటన గురువారం తిప్పర్తి మండలంలోని తిప్పలమ్మగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. తిప్పలమ్మగూడెం గ్రామ శివారులో రైతు దేవిరెడ్డి నారాయణమ్మకు చెందిన వ్యవసాయ క్షేత్రానికి అనుకొని గురువారం ఉపాధి కూలీలు పనులు చేశారు. ఉపాధి కూలీలు చెత్త తగులబెట్టి ఇంటికి వెళ్లిపోయారు. మంటలు పక్కనే ఉన్న నారాయణమ్మ పొలానికి అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో పొలంలోని మూడు మోటారు స్టార్టర్లు, పైపులు కాలిపోయాయి. రూ.60వేల మేర నష్టం వాటిల్లిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

మునగాలలో 700 గడ్డి మోపులు..

మునగాల: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గడ్డి మోపులు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన తోట రాంబాబు ఇటీవల రూ.70వేల విలువ గల 700 గడ్డిమోపులను కొనుగోలు చేసి ఊరి చివరన తనకు సంబంధించిన ఖాళీ స్థలంలో గడ్డివాములుగా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డిమోపులు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చే లోపే గడ్డి మోపులు పూర్తిగా కాలిపోయాయిని బాధితుడు తెలిపాడు.

ట్రావెల్స్ బస్సు బోల్తా

- క్షేమంగా బయటపడిన ప్రయాణికులు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలో గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్తున్న ఈ బస్సు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం దాటాక రహదారి నుంచి పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. అయితే, రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ రాళ్లను తాకి బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు ఉండగా ఒక మహిళకు మాత్రమే స్వల్ప గాయాలయ్యాయి. మోతె పోలీసులు కేసు నమోదు చేశారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

చిలుకూరు: వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన చిలుకూరు మండలం నారా యణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన కందుకూరి పెంటయ్య(75) కొన్ని రోజులుగా జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. దీనికి తోడు మూడు రోజులుగా ఎండలు మండిపోతుడడంతో వడగాల్పులకు అనారోగ్యానికి గురైన పెంటయ్య ఇంటి వద్దే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి భార్య సాయమ్మ కోరారు.

ధాన్యం కొనుగోలు చేయడం లేదని రాస్తారోకో

పెద్దవూర: ధాన్యం కొనుగోలు చేయడం లేదని మండలంలోని పోతునూరు, పులిచర్ల గ్రామాలకు చెందిన రైతులు గురువారం పోతునూరు స్టేజీ వద్ద జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ధాన్యాన్ని పోసి నిప్పంటించి రాస్తారోకో చేపట్టారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు చేయడంలో ఐకేపీ, పీఏసీఎస్ నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి నెలరోజులు గడుస్తున్నాయని, ఏఈఓలు తేమశాతం, తాలు శాతం చూసి ఓకే అని చెప్పినా బస్తాలు ఇవ్వడం లేదని వాపోయారు. దళారులకు, రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులకు మాత్రమే బస్తాలు ఇస్తూ లారీలలో తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ బస్తాలు ఇచ్చి ధాన్యాన్ని బస్తాలలో నింపినా పదిరోజులైనా లారీలు రావడం లేదని, దీంతో ఎప్పుడు వర్షం వస్తుందోనన్న భయంతో కంటికి మీద కునుకు లేకుండా పోతుందని వాపోయారు. ఉన్నతాధికారులు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి, లారీలను పంపేదాకా రాస్తారోకోను విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తన సిబ్బందితో వచ్చి రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి రాస్తారోకోను విరమింపజేశారు.


పోతునూరు స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

అదుపుతప్పి కాలువలో పడిన బైక్.. వ్యక్తి మృతి

పెద్దవూర: బైక్ అదుపుతప్పి కాలువలో పడటంతో వ్యక్తి మృతిచెందిన ఘటన పెద్దవూర మండలంలోని చింతపల్లి స్టేజీ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం పెద్దపాలెం గ్రామానికి చెందిన షేక్ లాలుసాహెబ్(50) ప్రతి ఏడాది సీజన్ వారీగా కుటుంబంతో కలిసి మండలానికి వచ్చి ధాన్యం తడవకుండా వేసే కవర్(పట్టాలు)లు అద్దెకు ఇచ్చుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ యాసంగి సీజన్‌లోనూ మండలంలోని నాయినవానికుంట స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద చిన్నపాటి గుడిసె ఏర్పాటు చేసుకుని రైతులకు పట్టాలు కిరాయికి ఇస్తున్నాడు. అదేవిధంగా నిడమనూరు మండలంలోని పార్వతీపురం గ్రామం వద్ద సైతం రైతులకు పట్టాలను అద్దెకు ఇస్తున్నాడు. బుధవారం సాయంత్రం లాలుసాహెబ్ బైక్‌పై పార్వతీపురం వెళ్లి పనులు చూసుకుని మంచం, కోళ్లను తీసుకుని నాయినవానికుంటకు తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యలో పెద్దవూర మండలంలోని చింతపల్లి స్టేజీ సమీపంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాలువ డిస్ట్రిబ్యూటరీ–8, 9పై ఏర్పాటు చేసిన వంతెన వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి పదిహేను అడుగుల లోతులో ఉన్న కాలువలో బైక్‌తో సహా పడిపోయాడు. దీంతో లాలుసాహెబ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం వ్యవసాయ పనులకు ఆటుగా వెళ్లిన రైతులకు వంతెన కింద బైక్‌తో పాటు గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు పట్టాలు కిరాయికి ఇచ్చే లాలుసాహెబ్ అని గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని లాలుసాహెబ్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. బుధవారం రాత్రి లాలుసాహెబ్ ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్చాఫ్ కావడంతో.. పార్వతీపురంలోనే ఉండి ఉదయాన్నే వస్తాడులే అనుకున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్ఐ పచ్చిపాల పరమేష్ ఘటనా స్థలానికి చేరుకుని బైక్, మృతదేహాన్ని స్థానికుల సహాయంతో కాలువ నుంచి బయటకు తీయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ద్రాక్షాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.


కాలువలో బైక్‌తో పాటు లాలుసాహెబ్ మృతదేహం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కుక్క అడ్డురావడంతో..

కోదాడరూరల్: కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి లైన్ ఇన్‌స్పెక్టర్ మృతిచెందిన ఘటన కోదాడ మండలం కాపుగల్లు రెవెన్యూ పరిధిలోని తొగర్రాయి సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన మిర్యాల గోవిందస్వామి(56) మునగాలలో విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా గురువారం కూడా విధులకు హాజరయ్యేందుకు అతడు బైక్‌పై వెళ్తుండగా కూచిపూడి–తొగర్రాయి సబ్‌స్టేషన్ రోడ్డులో బైక్‌కు కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయి ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో బైక్ అదుపతప్పి రోడ్డుపై పడటంతో గోవిందస్వామి ముఖం, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని కోదాడకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.


గోవిందస్వామి (ఫైల్)

సాక్షి క్లాసిఫైడ్స్

Education

6 నెలల్లో 10th; ఇంటర్; డిగ్రీ; P.G; I.T.I. డిప్లమా B.Tech; D.M.L.T; M.L.T; ANM; GNM; నర్సింగ్; D.ఫార్మసీ; B.ఫార్మసీ; B.A.M.S; B.H.M.S పూర్తిచేయండి. 95504 43817 [B-758929]

Real Estate

FLAT FOR SALE

LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3219]

PLOT FOR SALE

ప్లాట్లు అమ్మబడును సూర్యాపేట కొత్త కలెక్టర్ కార్యాలయముకు 1 కీ.మీ. (కుడ కుడ) రెసిడెన్షియల్ ప్రాంతంలో ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ 9704766530 [Y-1124035]

HOUSE FOR SALE

MIRYALAGUDA, FIRST GATED Community 92 Luxury Villas Club house Swimming pool, Ready to Occupy Just Rs: 1.09Cr Contact: 9502277099 [H-797597]

Services

ఆయుర్వేదం

సరస్వతీ ఆయుర్వేదం, సెక్స్ సమస్యలు, సెక్స్ బలహీనతలు, సెక్స్ భయం, స్త్రీ కలయికలో అసమర్థత ఈ సమస్యలకు భయపడే అవసరం లేదు, అర్షమొలలకు ఉంగరం మందులు ఇవ్వబడును. గ్రా॥ చెర్వుగట్టు. 8978182084 [Y-753141]

OLDAGE HOME

సాయి వెంకటేశ్వర ఓల్డేజ్‌హోమ్ - సూర్యాపేట. వృద్ధాప్యం, పక్షవాతంతో మంచాన ఉన్న వారికి 24 గం॥ నర్స్, ఆయా, ఫిజియోథెరపి సేవలు అందించబడును. సంప్ర॥ 8142738346 (శేఖర్) 8977439337 [Y-1078747]

Wanted

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1190695]

Wanted B.Sc. Graduate with Preferable Experience in Analytical Laboratory/ Process industry for Assistant Chemist/ Chemist. Send your resume to mail ID stores@greygoldcements.com or contact: 9390027984, 9182328533 [H-792883]

నల్లగొండ పట్టణం జిల్లా కోర్టు ప్రక్కన గల ప్రముఖ వెటర్నరీ షాపు నందు పనిచేయుటకు వర్కర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 9652053078, 8886001634 [Y-798206]

ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786333]

హైదరాబాద్ 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్/సె॥గార్డ్స్, సూ॥ వైజర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ. 15000–30000. ఫోన్:7981515640,9989930582, [H-781310]


Looking For Sales Officer with 2 Years Experience In Agro Chemical Marketing In Telangana State. 12Posts To be Filled Email : hr@hifield-ag.com Please Call : 7770008039 / 8380012271 [H-797475]

నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
9912220737, 9010080143, 9010002038
9666021744
9010178203
9912220740
9010422240, 9010038110
9010046033
9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పంట మార్పిడితో అధిక లాభాలు

- వేర్వేరు పంటల సాగుతో పెరగనున్న దిగుబడి
- తగ్గనున్న చీడపీడల బెడద
- పెద్దవూర ఏఓ సందీప్ సూచనలు



పెద్దవూర: రైతులు వేసిన పంటలే మళ్లీ వేస్తూ బాగా నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడంతో చీడపీడల వ్యాప్తి ఎక్కువై దిగుబడి తగ్గుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ సూచిస్తున్నారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు దిగుబడి పెరగడంతో పాటు భూమిలో సారం పెరుగుతుందని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడికి సంబంధించి సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

పంట మార్పిడితో..

- నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడపీడలు దూరం అవుతాయి.
- ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర వ్యాధులను దూరం చేయవచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది.


సాగవుతున్న మిరప పంట

- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చేసుకోవచ్చు.
- పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది.

పంటమార్పిడిలో తీసుకోవాల్సిన మెళకువలు

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బొబ్బెర, పెసర, మినుము వంటి పంటలను వేసుకోవడం వలన నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివలన కలుపు మొక్కలను నివారించవచ్చు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరకు వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- పత్తి సాగు చేసిన నేలలో మినుము, పెసర వంటివి వేయడం వలన తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలి. దీనివలన వెరుశనగ పంటను ఆశించే ఆకుముడత ఉధృతిని తగ్గించవచ్చు.
- పసుపు తర్వాత వరి, జొన్న వంటి పంటలను సాగు చేసుకోవాలి. దీనివలన నేలలో నెమటోడ్ల సంఖ్య తగ్గుతుంది.
- నులిపురుగుల సమస్య అధికంగా ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, పొగాకు, వంగ పంటలను కొంతకాలం పాటు తప్పనిసరిగా ఆపాలి.

ఇలా చేసుకోవచ్చు..

యాసంగిలో వేరుశనగ సాగు చేసిన రైతులు తర్వాత వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. కంది, శనగ పంటలను వరుసగా వేస్తే కాయతొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్టవరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాల పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి ఆపరాల పంటలను లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు.

ధాన్యం పంటలతో ...

దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లిసాగు చేసే రైతులు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. వరి, చెరుకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజీ పంటలను ఆశించే లద్దె పురుగుల తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో మార్పిడి చేయాలి.

ఇలా చేయవద్దు..

పంట మార్పిడి చేసే సమయాలలో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలి. లేదంటే చీడపీడల ఉధృతి ఎక్కువ అవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాట, క్యాబేజీ, దోస, గుమ్మడి, సొర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకుముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయాచిక్కుడు వేయకూడదు.

ఎంపికలో జాగ్రత్తలు

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటను ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తూ ఉంటాయి. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. ఆపరాల పంటల మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవుల చర్య వల్ల ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్లరేగడి నేలల్లో సోయాచిక్కుడు వేసుకుంటే పంట కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.